# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ కూటమి నేతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
2. ఆంధ్రప్రదేశ్ శాసనసభని రద్దు చేస్తూ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు.
3. ఆంధ్రప్రదేశ్ ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించినందుకు ఎన్నికల అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అభినందనలు తెలిపారు.
4. తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పాలనకు నిదర్శనంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు.
5. ప్రముఖ ఇంజనీరు పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు జయంతి ఈరోజు.

==========================

ప్రధానమంత్రి పదవికి భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ రాజీనామా చేశారు. దీంతో 17వ లోక్ సభను రద్దు చేస్తూ కేంద్ర మంత్రివర్గ తీర్మానాన్ని రాష్ట్రపతికి అందజేశారు. ప్రధానమంత్రి రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కాగా నూతన ప్రభుత్వం ఏర్పాటు అయ్యేంతవరకు అపద్ధర్మ ప్రధానమంత్రిగా కొనసాగాలని రాష్ట్రపతి కోరారు.మరో వైపు నిన్న ఎన్డీయే కూటమి నేతలు ఢిల్లీలో సమావేశమైయ్యారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. వికసిత భారత్ పట్ల నరేంద్రమోదీకి స్పష్టమైన అవగాహన ఉందని ఎన్డీఏ భాగస్వామ్యులు ఉద్ఘాటించారు. కూటమి శాసన సభపక్ష నాయకులుగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు నరేంద్ర మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్‌తో సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

అలాగే లోక్ సభ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి 234 స్థానాల్లో గెలుపొందగా ఫలితాలపై ఇండియా కూటమి నేతలు కూడా గత రాత్రి ఢిల్లీలో సమావేశం అయ్యారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభని రద్దు చేస్తూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్టికల్ 174 ప్రకారం మంత్రివర్గం సిఫార్సు మేరకు రాష్ట్ర శాసనసభను రద్దు చేస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. కాగా సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో 164 స్థానాల్లో విజయం సాధించిన ఎన్డీయే కూటమి నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. దీంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

------------------------

ఆంధ్రప్రదేశ్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లాల ఎన్నికల అధికారులకు, ఆర్వోలకు, ఎన్నికల సిబ్బందికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అభినందనలు తెలిపారు.ప్రజాస్వామ్య పండుగను రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా అనుసరించిన పద్ధతులను భవిష్యత్తు తరాలవారికి మార్గదర్శకంగా ఉండే విధంగా ఒక కరదీపిక రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా అనుసరించిన వినూత్న పద్ధతులను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు రోజుల్లోగా రాష్ట్ర ఎన్నికల సంఘ కార్యాలయానికి నివేదికలు పంపాలని కోరారు. అన్ని జిల్లాల నివేది కల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని చెప్పారు.ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం అవిరళ కృషిచేసిందన్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ప్రజాస్వామ్య పండుగను రాష్ట్రంలో ఎంతోవిజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

------------------------

తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పాలనకు నిదర్శనంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ప్రభుత్వ పాలన నచ్చితే ఓటు వేయాలని లోక్‌సభ ఎన్నికల్లో కోరామని, 8 మంది కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. వందరోజుల పాలన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 41 శాతం ఓట్లు వచ్చాయన్నారు.

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో ఇకపై ప్రతి ఏటా డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ రోజున సచివాలయంలోని అన్ని కార్యాలయాల్లో ఉత్సవాలు చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఉత్సవాలకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఆహ్వానించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

------------------------

అంతర్జాతీయ ఉత్పత్తుల సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో రేపు, ఎల్లుండి హైదరాబాద్ లో ప్రపంచ వరి శిఖరాగ్ర సదస్సు-2024 జరగనుంది. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థల కన్సార్షియం, భారతదేశ వరి పరిశోధన సంస్థ తదితరసంస్థల ప్రతినిధులతో పాటు దాదాపు 30 దేశాలనుంచి వరి ఎగుమతి, దిగుమతిదారులు, తెలంగాణ రాష్ట్రం నుంచి అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ప్రపంచ వరి శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. ప్రపంచంలో బియ్యం వినియోగంఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో వరిపంట ప్రాధాన్యం పెంచడంతో పాటు విస్తీర్ణాన్ని వృద్ధి చేయడం ద్వారా ఆహారభద్రత, బియ్యం మార్కెటింగ్ ను విశ్వవ్యాప్తం చేయడం, ఎగుమతుల పెంపు లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. వరిసాగులో ఎరువులవాడకం తగ్గింపు, వాతావరణ పరిస్థితులను అధి గమించేలా సాగ పద్దతులు, సాంకేతిక వినియోగం వంటి అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు.

---------------------------

ప్రముఖ ఇంజనీరు పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు జయంతి ఈరోజు. డాక్టర్ కె.ఎల్. రావుగా మనకు సుపరిచితులైన ఈయన 1902, జూన్ 6వ తేదీన కృష్ణాజిల్లా విజయవాడకు సమీపంలోని కంకిపాడు గ్రామంలో జన్మించారు. 1962 నుండి 1977 వరకు మూడు పర్యాయములు విజయవాడ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఈయన జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీల మంత్రివర్గములలో పది సంవత్సరాల పాటు కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖా మంత్రిగా పనిచేశారు. నాగార్జునసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టు రూపకల్పన చేసినది కె.ఎల్.రావే. ఇంజనీరుగా ఈయన చేసిన విశిష్టసేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కారం లభించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నికల ఫలితాలతో కూటమిపై గొప్ప బాధ్యతను అప్పగించారని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. నిన్న అమరావతిలో ఎన్నికల్లో గెలుపొందిన టిడిపి శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. గెలుపొందిన అభ్యర్థులు ప్రజలు పట్ల బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం.. ప్రతి సమస్యనూ నెరవేరుస్తామని చెప్పారు. కర్నూలులో వలసలు అరికట్టాలని, పల్నాడు, ప్రకాశం తదితర జిల్లాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయం అని ఓటర్లు తీర్పునిచ్చారని బిజెపి తరపున మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజానీకం అంతా నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావాలని కోరుతూ బిజెపికి ఓటు వేశారని తెలిపారు.

---------------------------

తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ బ్యారేజ్‌ని కేంద్ర భూ పరీక్షల సాంకేతిక నిపుణుల బృందం నిన్న పరిశీలించింది. ఇందులో భాగంగా నిపుణుల బృందం బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన భూ భౌతిక స్థితి, మృత్తిక, భూ సాంకేతిక పరీక్షలను నిర్వహించింది. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో ఉపయోగించిన నిర్మాణ సామాగ్రిని, అక్కడి మట్టి నమూనాలను బృందం సేకరించింది. బ్యారేజ్ కుంగిన 12, 13 పిల్లర్ల దగ్గర 25 అడుగుల మేరకు తవ్వి పరీక్షలు నిర్వహించారు. పిల్లర్లు కుంగిపోవడానికి గల కారణాలు కనుగొనేందుకు పరీక్షలు నిర్వహించినట్లు బృందం తెలిపింది.

---------------------------

టి20 ప్రపంచ కప్‌లో భాగంగా నిన్న న్యూయార్క్ నాసా కౌంటీ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 16 ఓవర్లలో 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 12. 2 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 97 పరుగులను చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా ఈ నెల 9న భారత్, పాక్ జట్ల మధ్య న్యూయార్క్‌లో మ్యాచ్ జరుగుతుంది.

---------------------------

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లో పూర్తిగా విస్తరించాయని, రాబోయే 3 లేదా 4 రోజుల్లో కోస్తాంధ్ర, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ పరిసర ప్రాంతాల్లో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి భారీవర్షాలకు అవకాశముందని పేర్కొంది. ఈరోజు  అల్లూరిసీతారామరాజు, బాపట్ల, ఏలూరు, కాకినాడ, కృష్ణా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవ కాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. అలాగే తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురవొచ్చని హైదరాబాద్  వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా నిన్న తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో అక్కడక్కడ, వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి.

=======================